క్లుప్తంగా

9న ఎంఎంఎన్ యాప్ ఆవిష్కరణ

కాచిగూడ: మీటింగ్ మిలియన్స్ నెట్‌వర్క్ (ఎంఎంఎన్) ఆధ్వర్యంలో ఈనెల 9న జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే బిజినెస్ మీట్‌లో ఎంఎంఎన్ యాప్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు ప్రకటించారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా 1000కి పైగా వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు హాజరవుతారన్నారు. ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల వారు 9391841653.

పనులు సకాలంలో పూర్తి చేయండి


సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో జలమండలి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన నివాసంలో జలమండలి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. చాలా ప్రాంతాల్లో పైపులైన్ కోసం చేపట్టిన తవ్వకాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పైపులైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. జలమండలి అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలి

ముషీరాబాద్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దళితరత్న అవార్డు గ్రహీత గడ్డం రమేష్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, సివిల్ రైట్స్ ఆధ్వర్యంలో హక్కులపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గడ్డం రమేష్ మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో సమావేశాలు నిర్వహిస్తూ.. చట్టాలు, హక్కులపై సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు న్యాయ సలహాలు ఉచితంగా అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, సివిల్ రైట్స్ కమిటీ ప్రతినిధులు జగన్, సురేష్, బస్తీ పెద్దలు తదితరులున్నారు.

ప్రశంసలు అందుకున్న గానకోకిల

కాచిగూడ: అమెరికా ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా అట్లాంటలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమంలో బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన యువ గానకోకిల, ప్రముఖ క్లాసికల్ సింగర్ టి.మాళవిక ఆనంద్ పాల్గొని భక్తి పాటలను ఆలపించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి ఆలపించిన దేశభక్తి గీతాలను పాడి అందరినీ మెప్పించారు. ఈ సందర్భంగా మాళవిక ఆనంద్‌ను అమెరికా ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ భాస్కర్ కొట్టె, కన్వీనర్ విజయ్ గుడిసేవా తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.

న్యూసెన్స్ కేసులో ఆరుగురికి జైలు

చిక్కడపల్లి: మద్యం తాగి న్యూసెన్స్ సృష్టిస్తున్న ఆరుగురు యువకులను సికింద్రాబాద్ 13వ మెట్రోపాలిటన్ కోర్టు ఐదురోజుల జైలుశిక్ష విధించినట్లు దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ.. న్యూసెన్స్ సృష్టిస్తున్న వి.ఉదయ్‌కిరణ్, పి.నీరజ్‌బాబు, డేవిడ్‌రాజు, జి.అరుణ్, జి.నిఖిల్, జి.సంజయ్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా.. వారికి ఐదు రోజుల పాటు జైలుశిక్ష రూ.200ల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

'యంత్ర లేఖన విశారదుడు' సాంబశివశాస్త్రి


బిరుదును ప్రదానం చేస్తున్న కామేష్ మల్లెల, గౌరీశంకర్ తదితరులు

చిక్కడపల్లి: యంత్రాలు దోష నివారణకు శుభాలకు దోహద పడతాయని ఆధ్యాత్మిక వేత్తలు అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా నిర్వహణలో యంత్రలేఖ పరిశోధకులు పోవూరి సాంబశివశాస్త్రికి 'శ్రీ యంత్ర లేఖన విశారద' బిరుదు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కామేష్ మల్లెల మాట్లాడుతూ.. శ్రీ చక్రం శాస్త్ర బద్ధమైందని పలు దేవాలయాల్లో మంత్ర సహిత చక్రం నిక్షిప్తమవుతుందన్నారు. సాంబశివ శాస్త్రి ఈ విద్యలో అపరిమిత పరిజ్ఞానం సంపాదించారని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ హనుమంతరాయ శర్మ, రామగౌడ్, రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

- కనీస సౌకర్యాల కల్పనకు కృషి
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్: నగరంలో ప్రసిద్ధిగాంచిన ఇందిరా పార్కులో కనీస సౌకర్యాల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పార్కులో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకు కూడా టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జంటనగరాల్లో ప్రసిద్ధిగాంచిన ఇందిరాపార్కులో ఓపెన్‌జిమ్, ఫ్లోరింగ్, ఫెన్సింగ్‌తోపాటు పుట్‌పాత్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం ఇందిరాపార్కులో రూ. 27లక్షలతో నిర్మించే ఓపెన్‌జిమ్ నిర్మాణపనులు, కనీస సౌకర్యాల కల్పన, కవాడిగూడ గగన్‌మహాల్‌లో రూ.15లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరాపార్కులో ఉన్న ఓపెన్‌జిమ్‌లో ఉన్న జిమ్ పరికరాలు అన్ని తుప్పుపట్టిపోయాయని, వెంటనే జిమ్ పరికరాలను కొత్తగా ఏర్పాటు చేయాలన్నారు. ఓపెన్‌జిమ్ చుట్టూ ఫెన్సింగ్, ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

- ఇందిరాపార్కులో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు కూడా అధికారులతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలిచి స్విమ్మింగ్‌పూల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- జంటనగరాల నుంచి అనేక మంది ఉదయం, సాయత్రం సమయాల్లో ఇందిరాపార్కులో నడిచేందుకు వచ్చే వాకర్స్‌ను దృష్టిలో పెట్టుకుని నగరంలోనే ఇందిరాపార్కును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
- గగన్‌మహాల్‌లో జనాభాకు అనుగుణంగా తాగునీటి డ్రైనేజీ పైపులైన్ల ఆధునీకరణ తర్వాతే సీసీరోడ్డు నిర్మాణపనులు చేపట్టాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశామన్నారు. దీంతో గగన్‌మహాల్‌లో తాగునీటి, డ్రైనేజీ సమస్యతో పాటు రోడ్డు సమస్య కూడా తీరిపోనుందన్నారు.
- ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతూ.. ముందుకుసాగుతున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు కూడా అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని అప్పుడే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ. సుధాకర్‌యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నేతలు ఎన్డీ సాయికృష్ణయాదగిరి, ఆర్.రాంచందర్, రాజశేఖర్‌గౌడ్, రాజేష్, మహేష్, మధు, మహేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, రాజుయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, యువమోర్చా అధ్యక్షుడు దిలీప్ యాదవ్, ఆర్.కె. శ్రీనివాస్‌ముదిరాజ్, స్థానికులు కే.ఆర్,కే. ప్రసాద్, పాస్‌పోర్టు శ్రీనివాస్, మున్సిపల్ డీఈ సన్నీ, సూపర్‌వైజర్ మహేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంపూర్ణ, ప్రధాన కార్యదర్శి శోభ, మేకల అనిత, శ్రీదేవి, రాధిక, విజయ, మల్లికాంబ, జ్యోతి, రాధమ్మ తదితరులున్నారు.

ఉదయనిధి స్టాలిన్‌ను బర్తరఫ్ చేయాలి


మాట్లాడుతున్న సూర్యప్రకాష్‌సింగ్

కాచిగూడ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి, హిమాలయ పరివార్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.సూర్యప్రకాష్ సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీసిందన్నారు. సనాతన ధర్మాన్ని కరోనాతో పోల్చడం అత్యంత దుర్మార్గమని, దీనికి సీఎం స్టాలిన్ పూర్తి నైతికబాధ్యత వహించాల్సి ఉందని హెచ్చరించారు. మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన ఉదయనిధి స్టాలిన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సనాతన ధర్మంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు.

క్షమాపణ చెప్పాలి..

కాచిగూడ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుమారుడు, ఆ రాష్ట్ర యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్న మాటలను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఓ ప్రకటనలో ఖండించారు. ఓ మతానికి వత్తాసు పలుకుతూ.. సనాతన ధర్మాన్ని పాటించే ప్రజలను దూషించడం తగదన్నారు. శ్రీ కృష్ణ పరమాత్మ చేత చెప్పబడిన భగవద్గీతకు దాదాపు 5వేల సంవత్సరాల ఉనికి ఉందని, ఇతర మతాలు ఆ తర్వాతే వచ్చాయని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిదంబరం కూడా ఆయన వ్యాఖ్యల్ని ఖండించకపోగా.. సమర్థించడం విడ్డూరంగా ఉందన్నారు. 100 కోట్ల మంది హిందువులకు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


గ్రీన్‌ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ మనుగడకు కీలకమైన ప్రకృతి ప్రమాదంలో నెట్టివేయబడిందని తక్షణమే దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆందోళ్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, సౌత్ ఇండియన్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న రన్ ఫర్ ఎన్విరాల్‌మెంట్ గ్రీన్‌ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు సి.శ్యామ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం చొరవతో హరితహారం, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

దేశంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలు !


అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ మురళీమనోహర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలోనే రాష్ట్రంలో అత్యంత ఖరీదైన ఎన్నికలు కాబోతున్నాయని సామాజిక తెలంగాణ పొలిటిక్ ఫ్రంట్ చైర్మన్ ప్రొఫెసర్ మురళీమనోహర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాసనసభ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళీ మనోహర్ మాట్లాడుతూ.. నేడు సామాన్యులు ఎన్నికల్లో పోటీచేయలేని దుస్థితి నెలకొందని అయితే సామాన్యులు కూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని నిరూపించడానికే తమ పొలిటికల్ ఫ్రంట్ కృషి చేస్తుందన్నారు. నిజమైన ఉద్యమకారులు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో కింది కులాలవారికి తీరని అన్యాయం జరిగిందన్నారు. విద్య, వైద్యం పూర్తిగా విధ్వంసాలకు గురైందన్నారు. ప్రజలకు అవసరమైన ఎజెండా లేకపోవడం బాధాకరమని విమర్శించారు. పొలిటికల్ ఫ్రంట్ నాయకులు అంసోల్ లక్ష్మణ్, పొలిటికల్ ఫ్రంట్ నాయకులు రాందాస్‌నాయక్, కన్వీనర్ ప్రసాద్‌గౌడ్, ప్రొఫెసర్ తిరుమలి, కే.వీ.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులుగా కన్నె రమేష్‌యాదవ్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు సోమవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ.. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గౌతంరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్, పార్టీ నేతలు భీమ్‌రాజ్, రవియాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, నర్సింగ్ యాదవ్, శీరసాగర్, హజారిబాబు, మల్లికార్జున్, ప్రతిభ, అరవింద్, శాంతాబాయి, సారిక, లావణ్య, ఓంప్రకాష్, ఆర్.సంతోష్ తదితరులున్నారు.

అవకాశమిస్తే పోటీ చేస్తా !


ఎలక్షన్ కమిటీ సభ్యులకు దరఖాస్తును అందజేస్తున్న డాక్టర్ పద్మజ

ముషీరాబాద్: అవకాశం ఇస్తే ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని బీజేపీ మహంకాళి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మజ అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల కమిటీ నాయకులను కలిసిన ఆమె తాను ముషీరాబాద్ నుంచి పోటీ చేస్తానని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నానన్నారు. మహిళలు, యువతకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పలు సదస్సులు, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదిష్టానం, ప్రజలు ఆశీర్వదిస్తే ఎన్నికల్లో ముషీరాబాద్ నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట: భారత తొలి రాష్ట్రపతి, ఉపాధ్యాయుడు దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్ చందర్ రావు ఆధ్వర్యంలో సోమవారం జామై ఉస్మానియా అపోలో గ్రామర్ హైస్కూల్‌లో 500 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. దాతలు ప్రొఫెసర్ సీహెచ్. మధుసూధన్ రావు, బీఎస్ఎన్ఎల్ నర్సింహారావు, మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కుమారుడు, పీవీ. ప్రభాకర్ రావు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. టీబీఎస్ఎస్ ప్రతినిధులు అశోక్‌కుమార్, సీహెచ్.మురళీ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు మంచాల, ఉపాధ్యాయులు ఎస్‌పీ.లక్ష్మి, జయంతి, అశ్విని, వాణి, అనూష, ఉమాదేవి, విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌టీ కార్మికులకు చారిత్రాత్మక అగ్రిమెంట్


ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీఎస్‌టీ కార్మికుల కోసం చారిత్రాత్మకమైన అగ్రిమెంట్ చేశామని యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో అగ్రిమెంట్ పత్రాలను లేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి సమక్షంలో వీఎస్‌టీ యూనియన్ నాయకులు, వీఎస్‌టీ మేనేజ్‌మెంట్ మార్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో కనివిని ఎరగని రీతిలో కార్మికులకు అనుకూలంగా మూడు ఒప్పందాలను చేశామన్నారు. ఈ ఒప్పందాలను కూడా కార్మికులకు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో కార్మిక పక్షపాతిగా వ్యవహరిస్తూ.. వారికి మెరుగైన అగ్రిమెంట్లు చేస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అయిలి ప్రభాకర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ బాబీ, కోశాధికారి నరేంద్రగౌడ్, డిప్యూటీ సెక్రటరీ రవియాదవ్, కంపెనీ హెచ్‌ఆర్ అమిత్‌అరోరా, శ్రీరామ్, అనీష్‌గుప్తారావు తదితరులున్నారు.

కలశ పూజ


పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా 'మేరీ మాటి – మేరా దేశ్' కార్యక్రమాన్ని సోమవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాచిగూడ, చెప్పల్‌బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో వివిధ పోలింగ్ బూత్‌ల నుంచి సేకరించిన మట్టిని కలశంలో నింపి పూజ చేశారు. అనంతరం ఈ కలశం మట్టిని పార్టీ జిల్లా కార్యాలయంలో అందజేశారు. దేశంలో నూతనంగా నిర్మించనున్న స్మృతి భవన నిర్మాణానికి ఈ మట్టిని వినియోగిస్తారన్నారు. బీజేపీనేతలు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, సుభాష్ పటేల్, శ్యామ్‌రాజ్, బల్బీర్, దిలీప్, వాసు, ప్రతిభ, బీమ్‌రాజ్, రాజ్‌కుమార్, తిలక్, కృష్ణంరాజు, ఎస్. రవియాదవ్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో మాదిగలకు అన్యాయం'


మాట్లాడుతున్న గారే వెంకటేష్ మాదిగ

ముషీరాబాద్: 'రాష్ట్రంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్ని రాజకీయ పార్టీలు మాలలకే ప్రాధాన్యతనిస్తూ.. మాదిగల పట్ల వివక్షత చూపిస్తున్నారని' మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ ఆరోపించారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద మాదిగ పరిరక్షణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70లక్షలపైగా జనాభా కలిగిన మాదిగ, మాదిగ ఉపకులాలకు కేసీఆర్ ప్రభుత్వంలో గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. మాలలకు ఇచ్చే గౌరవం గుర్తింపు మాదిగలకు ఇవ్వకుండా అవమానించేలా చూస్తున్నారన్నారు. ఎస్సీ, వర్గీకరణ అంశంతో పాటు సమకాలిన రాజకీయ పరిస్థితులు, మాదిగలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చట్టసభల్లో సమన్యాయ సాధనకై అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలకు అధిక సీట్లు కేటాయించాలని, లేని పక్షంలో ఆ పార్టీలను ఓడించేందుకు మాదిగలు వెనుకాడరని హెచ్చరించారు.

నాలా పరిసరాల్లో భారీ భవనాలకు అనుమతులివ్వొద్దు


ఫిర్యాదు కాపీని చూపుతున్న స్థానికులు

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్ నాలా పక్కన భారీ భవనాలకు అనుమతులు ఇవ్వరాదని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు. సోమవారం చిక్కడపల్లిలోని నారాయణగూడ హుస్సేన్ సాగర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌సింగ్, భవానీసింగ్‌లు మాట్లాడారు. బ్రిడ్జి పక్కన కొందరు వ్యక్తులు అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని చెబుతున్నారు. 360 గజాల స్థలంలో ఐదంతస్తుల భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు ఏ విధంగా వచ్చాయని ప్రశ్నిస్తున్నారు. సెల్లార్ పర్మిషన్ లేకపోయినా అక్రమంగా సెల్లార్ నిర్మించారని, నియమనిబంధనలు పాటించకుండా భవన నిర్మాణం జరుగుతుందన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో భారీ నిర్మాణాల వల్ల ప్రక్కన ఉన్న భవనాలకు నష్టం జరిగిందని వివరించారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్థానికులు జ్యోతి, లక్ష్మి, కల్పన, లిఖిత, సునీత తదితరులున్నారు.

'ఎంఎంటీఎస్ రైల్ సర్వీసులను మూసివేసే కుట్ర'

ముషీరాబాద్: ఎంఎంటీఎస్ ఫేస్-2ను అత్యంత ఆర్భాటంగా ప్రధాని ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారని, రైళ్లను సరిగ్గా నడపడం లేదని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. సమయ పాలన లేకుండా ప్రజలకు అందుబాటులో లేని పద్ధతుల్లో మెట్రోరైళ్లను నడుపుతున్నారని విమర్శించారు. దాదాపు రూ.900 కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. తప్పని పరిస్థితుల్లో ఇతర ప్రయాణ సాధనాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్లను నిరంతరంగా రద్దు చేయడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక ఎంఎంటీఎస్ వ్యవస్థను మూసి వేయడంలో లేక ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. ఎంఎంటీఎస్ అభివృద్ధికి చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తేయాలి


మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: చేనేత వృత్తి వ్యాపారం కాదని, దేశ వారసత్వ కళా సంపదని, అలాంటి చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని పూర్తిగా ఎత్తేయాలని చేనేత కార్మిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత పద్మశాలీ సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన పద్మశాలీ శంఖారావం విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 'చేనేత కళాకారులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలు, బలహీన వర్గాల వారని, అలాంటి వారిని జీఎస్టీ పేరిట దోపిడీ చేయడం సరికాదన్నారు'. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం చేనేత ముడిసరుకులపై ఎలాంటి పన్ను విధించలేదని గుర్తు చేశారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసే వరకు రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ పూర్తిగా భరించాలన్నారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు రూ.లక్ష వరకు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

కవితను కలిసిన హరిబాబుయాదవ్



ముషీరాబాద్: నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు ఎడ్ల హరిబాబుయాదవ్ సోమవారం మాజీఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బంజారాహిల్స్‌లో ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు హరిబాబుయాదవ్ తెలిపారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన వారికి అండగా ఉంటామని ఆమె వ్యాఖ్యానించారన్నారు.

సొంతింటి కల సాకారం

లాలాపేట: సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూమ్ పథకం ద్వారా పేద ప్రజల సొంతింటి కల సాకారం అయ్యిందని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. ఇటీవల మొదటి విడత లక్కీ డ్రా ద్వారా తార్నాక డివిజన్ నుంచి ఇళ్లు దక్కించుకున్న పలువురు లబ్దిదారులు సోమవారం తార్నాలో డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విలక్షణ గాయని రమణకుమారి

చిక్కడపల్లి: ప్రముఖ నేపథ్యగాయకులు సుశీల, భానుమతి, లీల, జిక్కి వంటి వారి పాటలు అలవోకగా ఆలపించగల రమణకుమారి విలక్షణ గాయని అని ప్రముఖ కళాపోషకుడు జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ స్థాపకుడు వెంకట్‌రెడ్డి ప్రశంసించారు. సోమవారం త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై ప్రముఖ మహిళ సంస్థ రాగరాగిణీ నిర్వహణలో రమణకుమారి బృందం సినీగానలహరి జరిగింది. గాయనీ గాయకులు రమణకుమారితో పాటు వేణుగోపాల్, రామకృష్ణ, అంజయ్య, హనుమంతరెడ్డి, మోహన్‌కృష్ణ, యుగళ గీతాలలో సహకరించగా.. శైలజ, కృష్ణకుమారి, లక్ష్మి, శాంతి, శ్రీలక్ష్మిలు పాలుపంచుకున్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి సంస్థ నివేదిక సమర్పించారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుర్గప్రసాద్ ప్రకటించారు. సోమవారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, పార్టీ గ్రేటర్ ఇన్‌చార్జిలు లింగస్వామిమహరాజ్, కృష్ణ మహరాజ్, లక్ష్మణ్, రాఘవేంద్ర, రాజేష్ తదితరులున్నారు.

అపస్మారక స్థితిలో వ్యక్తి.. ఆసుపత్రికి తరలింపు

చిక్కడపల్లి : కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద పుట్‌పాత్‌పై నివసిస్తున్న వ్యక్తి శేఖర్ (45) అపస్మారక స్థితికి చేరుకోవడంతో చిక్కడపల్లి పోలీసులు ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం.. రాయలసీమకు చెందిన శేఖర్‌కు గత ఆరు నెలల క్రితం పక్షవాతం వచ్చింది. అతడికి సపర్యలు చేసే తల్లి కొద్దిరోజుల క్రితమే చనిపోయింది. కాగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయం బయట రోడ్డుపై రిక్షాలో జీవనం సాగిస్తుండేవాడు. అతడికి స్థానికులు కొందరు రోజూ భోజనం ఇస్తుండేవారని సమాచారం. ఆది, సోమవారాల్లో వర్షం కురవడంతో రిక్షా తడిసిపోయి శేఖర్ పూర్తిగా చలికి వణుకుతూ.. అపస్మాపరక స్థితికి చేరుకున్నాడు. సోమవారం ఉదయం చిక్కడపల్లి పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం అతడు కోలుకోవడంతో అనాథాశ్రమానికి తరలిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

పద్మారావునగర్: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయనను నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ, ఇనుముల నరసయ్య, సామ్యూల్, యాదగిరి, సురేందర్, మహేష్, హాజీ, సుజాత కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ విషయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే విషయంలో సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383